
## వేగేశ్వరపురం గోదావరి మేరీమాత దేవాలయంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**తాళ్ళపూడి, పెన్ పవర్, ఏప్రిల్ 3:** మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో గోదావరి మేరీమాత దేవాలయంలో గుడ్ ఫ్రైడే వేడుకలు దేవాలయం రెవ. ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడి, వేగేశ్వరపురం పురవీధులలో, మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీగా యేసు భక్తులు యేసు శిలువను మోస్తూ, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక ప్రార్ధనలు, పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ఆ యేసు కృపకు పాత్రులయ్యారు.



పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## కోరుకొండ వడ్డీలు పేట రామాలయంలో అన్నదానం..



✷ ఆలయ కమిటీ సభ్యులు..

**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 3:** కోరుకొండ వడ్డీలు పేట రామాలయంలో శుక్రవారం ఉదయం భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. నూతన ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చింతూరులో ఎస్ఐ సంతోష్ కుమార్ చురుకుదనం

### బాధ్యతలు స్వీకరించగానే అవగాహన సదస్సులు

**చింతూరు, పెన్ పవర్ ఏప్రిల్ 3:** చింతూరు పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సంతోష్ కుమార్ ప్రజల్లో చైతన్యం పెంచే దిశగా చురుకుగా ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ప్రారంభించడం విశేషం. ఈ నేపథ్యంలో శుక్రవారం నిమ్మలగూడెం, కొయ్యుగురు గ్రామాలలో ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మహిళల భద్రత వంటి అంశాలపై వివరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు



సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి సమస్యలు వచ్చినా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రజల మధ్యకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏసుక్రీస్తు లోక రక్షకుడు- ఫాదర్ బాల్తజార్



**గోపాలపురం పెన్ పవర్ ఏప్రిల్ 2 :** పాపుల పాప పరిహార అర్ధమై ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మించారని వేళ్ళ చింతలగూడెం ఆర్ సి ఎం ప్రార్ధనాలయం ఫాదర్ కాటం బాల్తజార్ అన్నారు. గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) వేడుకలను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు. వేళ్ళ చింతలగూడెం ఆర్ సి ఎం చర్చ్ ఫాదర్ ఆధ్వర్యంలో సిలువను మోసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే అనేది ఏసుక్రీస్తు మరణించిన రోజు అన్నారు. ఆయన భూలోకంలో మానవునిగా జన్మించారని అన్నారు. ఎన్నో ఆధ్యాత్మిక విషయాలను మూడులకు తెలియజేశారని అన్నారు. క్రైస్తవ మత విశ్వాసులు 40 రోజులు చేసిన పవిత్ర ఉపవాస ప్రార్ధనలు నేటితో ముగుసాయన్నారు. ఏసుప్రభు భూలోకంలో జన్మించిన దైవ స్వరూపంగా అవి వర్ణించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమంలో విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని దొండపూడి ఆర్ సి ఎం చర్చ్ లో ఫాదర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గోపవరం గ్రామంలో పాస్టర్ రమేష్ , నందిగూడెం గ్రామంలో పాస్టర్ తిమోతి, రాంపాలెం గ్రామంలో పాస్టర్ చింతలపూడి జాన్ బాబు, చిట్యాల గ్రామంలో టి యేసు రాజు, స్థానిక పెద్ద గూడెంలో నాగేంద్రబాబు తదితర గ్రామాలలో ఆయా సంఘ విశ్వాసుల ఆధ్వర్యంలో శుభ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.

## రంపఎర్రంపాలెం పలు చర్చిలలో మహా శుక్రవారం



**గోకవరం పెన్ పవర్ 03:** --సకల మానవాళి పాప పరిహారార్థమై క్రీస్తు తన ప్రాణాన్ని బలిగా అర్పించిన రోజును గుడ్ ఫ్రైడే గా జరుపుకుంటామని
బేతస్థ ప్రార్ధన మందిరం రెవ.పాస్టర్ జి.మనోహర్ అన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని శుక్రవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మనోహర్ మాట్లాడుతూ సమస్త మానవాళి రక్షణ కోసం తన ప్రాణాలను సిలువలో అర్పించిన మహనీయుడు యేసు క్రీస్తు అని కొనియాడారు. అనంతరం చర్చ్ లో ప్రార్ధనలు నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవ.జి.మనోహర్, క్రీస్తు సందేశాన్ని, గుడ్ ఫ్రైడే విశిష్టతను భక్తులకు బోధించారు. ఈ కార్యక్రమంలో రంపఎర్రంపాలెం, పెంటపల్లి, గోకవరం సంఘాల క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని క్రీస్తుని కన్నీటితో స్మరించుకున్నారు. ఎరుషలేము ప్రార్ధన మందిరంలో పాస్టర్ సన్నపు ఏసుదానం ఆధ్వర్యంలోనూ మహా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు అత్యంత ఘనంగా వైభవంగా జరిగాయి. జాన్ పీటర్ లూథరన్ దేవాలయంలో మహా శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు అత్యంత



భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాన్ పీటర్ లూథరన్ దేవాలయంలో లో పాస్టర్ రెవరెండ్ కే కమలాకర్ ఆధ్వర్యంలో మహా శుక్రవారం ప్రార్థనలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. సెంట్ పీటర్ లూథరన్ దేవాలయంలో పాస్టర్ రెవరెండ్ ఎస్ రాంబాబు ఆధ్వర్యంలో మహా శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మరనాత ప్రార్ధన మందిరంలో పాస్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మహా శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలు భక్తులకు బోధించారు.

## వెలుగులో కోటికి పైగా అవినీతి

### అధికారుల మౌనంపై సీపీఎం ఆగ్రహం



**చింతూరు, పన్ పవర్ ఏప్రిల్ 3:** చింతూరు మండలంలో వెలుగు కార్యక్రమంలో కోటికి పైగా అవినీతి జరిగినప్పటికీ ఉన్నతాధికారులు మౌనం వహిస్తున్నారని సీపీఎం మండల కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం నిర్వహించిన సీపీఎం చింతూరు మండల కమిటీ సమావేశానికి సీసం సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ, గతంలో పనిచేసిన వెలుగు అధికారుల ఆధ్వర్యంలో కోటికి పైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ విషయంపై గ్రూప్ సభ్యులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అవినీతి కారణంగా గ్రూప్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ పేర్లపై ఇప్పటికే రుణాలు ఉన్నాయని చెప్పి కొత్తగా అప్పులు ఇవ్వడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. దీనివల్ల సభ్యులు ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సర్ఫ్ నుంచి వచ్చిన కమిటీ కూడా కోటికి పైగా అవినీతి జరిగిందని నివేదిక ఇచ్చినా, జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీఓలు ఇప్పటికీ స్పందించకపోవడం విచారకరమన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రూప్ సభ్యులందరినీ ఐక్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మోట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, మాజీ జెడ్పీటిసి ముర్రం రంగమ్మ, కారం సుబ్బారావు, చింత రాంబాబు, కారం నగేష్, సవలం కన్నయ్య, సోడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కాపవరం సర్పంచ్ జాజుల రాముకి చిరు సత్కారం..

### ఘనంగా వీడ్కోలు పలికిన పంచాయతీ సిబ్బంది. తెలుగుదేశం పార్టీ నాయకులు తెలగంశెట్టి శ్రీను..

**కోరుకొండ, పెన్ పవర్, ఏప్రిల్ 3:** కాపవరం సర్పంచ్ జాజుల రాముకి శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలగంశెట్టి శ్రీను రాముకి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పాటు సర్పంచ్ గా దిగ్విజయంగా ఆయన ప్రయాణం కొనసాగిందని ప్రతి సమస్యపై ప్రజల తరఫున పోరాడి సమస్యలు పరిష్కారం చేశారని తెలగంశెట్టి శ్రీను కొనియాడారు.






## శిథిల స్థితిలో వాటర్ ట్యాంక్

### పట్టించుకోని సంబంధిత అధికారులు

**వై రామవరం, పెన్ పవర్,ఏప్రిల్ 3 :** సుమారు రెండు దశాబ్దాల క్రితం కట్టిన వాటర్ ట్యాంక్ శిథిల స్థితికి చేరుకున్న సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వివరాల్లోనికి వెళ్తే మండలంలోని దేవరమడుగుల గ్రామంలో సుమారు రెండు దశాబ్దాల క్రితం వాటర్ ట్యాంక్ నిర్మించారని,నేటికి దాని ద్వారా నీరు సరఫరా జరుగుతుందని అంటున్నారు. కానీ వాటర్ ట్యాంక్ శిథిల స్థితికి చేరుకుందని మరమ్మత్తులు చేయడం పంచాయతీ సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వాటర్ ట్యాంక్ నుండి త్రాగునీరు లీకై వృధాగా పోతుందని, దానివల్ల వాటర్ ట్యాంక్ చుట్టుపక్కల బురదమయంగా మారిందని, దీనివల్ల దోమలు ప్రబలి మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు వెయ్యి మంది జనాభా ఉన్నారని జల జీవన్ మిషన్ ద్వారా మరో ఐదు మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారని వీటిలో కొన్ని సక్రమంగా పనిచేయకపోవడంతో త్రాగునీరు లభ్యం కావట్లేదని స్థానికులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం జల జీవ మిషన్ ద్వారా మంజూరైన ఇంటింటికి కొళాయి పథకం పూర్తి స్థాయిలో నెరవేరలేదని, అసంపూర్తి నిర్మాణాలతోనే పూర్తి చేశారని అంటున్నారు. ఇకనైనా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయం సిబ్బంది స్పందించి అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేసి ఇంటింటికి కొళాయి పథకం లక్ష్యాన్ని పూర్తి చేయవలసిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికుల కోరుచున్నారు.





# బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన సీఆర్ఎంటీ ప్రసాద్ కుటుంబానికి 'చేయూత' ఆర్థిక సాయం

**గంగవరం , పెన్ పవర్ ఏప్రిల్ 3:**మండల విద్యాశాఖలో సీఆర్ఎంటి గా విధులు నిర్వహిస్తూ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందిన దుమ్ముల వర ప్రసాద్ కుటుంబానికి 'చేయూత' స్వచ్ఛంద సేవా సంస్థ అండగా నిలిచింది. నెల్లిపూడి గ్రామానికి చెందిన ప్రసాద్ అకాల మరణం పట్ల సంస్థ ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏజెన్సీ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మల్లేశ్వరరావు సమక్షంలో, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు రవికుమార్, ఏపీసీఆర్‌పీడబ్ల్యూఏ అధ్యక్షులు రాంజీ ప్రసాద్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి మనోధైర్యం కల్పిస్తూ, తక్షణ ఆర్థిక సాయం కింద రూ.50,000 నగదును అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ, ప్రసాద్ పిల్లల విద్యాభ్యాసానికి తమ సంస్థ తరఫున పూర్తి సహకారం అందించడమే కాకుండా, వారి భవిష్యత్తుకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భాషా, శ్రీరామ్, సుభాన్, పవన్ కల్యాణ్, విష్ణు నాయుడు, సత్య, లలిత, తేజ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు ఉంది జనసేన పార్టీ నేతల తీరు



- సలహాలు ఇస్తే ఉలుకుబాటు ఎందుకు.
- వైసీపీ నాయకుల సూటి ప్రశ్న

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 03.**గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు జనసేన పార్టీ నేతల తీరు ఉందని ఎద్దేవాచేశారు తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ఈ తాడేపల్లిగూడెం నియోజకవర్గం కోసం ఎంతో చేశార, మనకంటూ దేశంలోనే ఒక గుర్తింపు తెచ్చిన వ్యక్తులు ఉన్నారన్నారు. 12 ఏళ్ల తర్వాత తాడేపల్లిగూడెం ఇలవేల్పు శ్రీ బలుసులమ్మ అమ్మవారు జాతర నిర్వహించారని, ప్రతీ ఒక్కరూ చాలా బాగా జాతర ఉత్సవాలు కోసం కష్టపడి పనిచేశారని, దానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అభినందిస్తున్నామన్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన మీడియా సమావేశంలో మేము ఎవరిని విమర్శించలేదని గుర్తించాలన్నారు. అవినీతి జరిగిందని ఇప్పుడు ఎవరన్నారని, మంచిగా చేశారు ఇంకా మంచిగా చేయమని చెప్తే దేనికి కంగారు పడుతున్నారన్నారని ప్రశ్నించారు. గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు జనసేన పార్టీ నేతల తీరు ఉందన్నారు. విరాళాలు ఇచ్చిన వారి వివరాలు ప్రదర్శించండి అని చెప్తే దానికి ఎందుకు అంత కంగారు పడుతున్నారో అర్థం కావట్లేదన్నారు. భగవంతుడి విషయంలో రాజకీయాలు చేయాల్సిన దౌర్భాగ్యం మాకు లేదన్నారు. ఒక్కసారి ఆరోజు మీడియా సమావేశంలో మాట్లాడింది మళ్ళీ వినాలన్నారు. ఇది ఎవరి ఇంట్లో పెళ్లి కాదని,. ఇది మా ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి జాతర అన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న ప్రతి ఒక్కరికి చెందిన కార్యక్రమని,. అలాంటి శుభ కార్యక్రమాన్ని కొంతమంది వాళ్ళకి ఇష్టమొచ్చినట్లు చేశారన్నారు. ఎన్నో సాంస్కృతిక కళలు ఉండగా అక్కడ ఏంచేశారని ప్రశ్నించారు. రోజూ రికార్డింగ్ డ్యాన్స్ లు చేయిపిస్తూ కొంతమందికి ఇష్టమొచ్చినట్లు చేశారన్నారు. దానికి మేము ఏమైనా అన్నామా అని ప్రశ్నించారు. అసలు ఏమైనా సంబంధం ఉందా మాట్లాడేదానికి, రాజకీయాలను దిగజార్చకండన్నారు. మంచి కోసం సలహా ఇస్తే దానికి సంబంధం లేకుండా నోటికొచ్చినట్లుగా మాట్లాడడం అత్యంత దారుణంగా ఉందన్నారు. జనసేన నాయకులు ప్రెస్ మీట్ లు పెట్టి ఏదో తమ నాయకులు చెప్పిన స్క్రిప్ట్ చెప్పడం తప్ప మేము మాట్లాడేది సరైనదా కాదా అసలు ఎవర్ని విమర్శిస్తున్నాం అనేది లేకుండా నోటికొచ్చినట్లుగా మాట్లాడడం అసహ్యంగా ఉందన్నారు. మా నాయకుడి గురించి అసలు మాట్లాడే అర్హత మీకుందా అని,. ఆయన ఈ జిల్లాలో ఉన్న అనేక దేవాలయాలకు ఒక డోనర్ అన్నారు. భగవంతునికి అత్యంత విధేయుడు ఆయన అన్నారు. జాతరకు విరాళాలు ఇచ్చిన వారి వివరాలు ప్రదర్శించండి అని ఒక సలహా ఇస్తే దానికి అవినీతి జరగలేదు, జరగలేదు అని ఎందుకు కాళ్ళు తొక్కేసుకుంటున్నారో తెలెట్లేదన్నారు. వడ్డి రఘురామ్ కి తాడేపల్లిగూడెంలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఒక బ్రాండ్ ఉందన్నారు. ఉనికి కోసం పోరాడాల్సిన పని ఆయనకి లేదన్నారు. అసలు ఆయన గురించి మాట్లాడే అర్హత ఎవరికైనా ఉందా అని ప్రశ్నించారు. ఎక్కడా కూడా లెక్క చెప్పలేదు, తినేశారు అని వ్యక్తిగత విమర్శలకు వెళ్లలేదన్నారు. పారదర్శకంగా జాతర చేసాం అని చెప్పారు అదే చెప్తే ఇప్పుడు ఏం చేయాలో తెలియక వ్యక్తిగత విమర్శలకు దిగడం చాలా దారుణంగా ఉందన్నారు. అసలు ఆలయం గురించి ఒక సలహా చెప్తే అందులో ఇబ్బంది ఉంటే ఆ ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడాలి అది మానేసి జనసేన నేతలకు ఎందుకు మాట్లాడుతున్నారు మీకు ఏమిటి సంబంధమో అర్థం కావట్లేదన్నారు. తాడేపల్లిగూడెం మార్కెట్ కు సంబంధించిన ఆసీలు గురించి మాట్లాడితే దానికి అధికారులు సమాధానం చెప్పాలి కానీ దానికి జనసేన నాయకులు ఎందుకు మాట్లాడుతున్నారో వారికే తెలియాలన్నారు. మీరు భుజాలు తడుముకోవడం చూస్తుంటే ప్రజలకు లేనిపోని అనుమానాలు వస్తున్నాయన్నారు. అమ్మవారిని రాజకీయాల కోసం వాడొద్దన్నారు. జాతర ముందు అందర్నీ కలుపుకుని ఆల్ పార్టీస్ మీటింగ్ వేశారా అని, అసలు ఆలయానికి ఒక కమిటీ వేశారా అని ప్రశ్నించారు. మీకు నచ్చినట్లు మీరు చేశారని,. దానికి తాము అడ్డుపడలేదని, అమ్మవారి కార్యక్రమం బాగా జరగాలి కోరుకున్నాం కాబట్టే ఎప్పుడు ఎవర్ని ఏమి అనలేదన్నారు. మీ డబ్బా మీరు కొట్టుకున్నారో లేదో నియోజకవర్గ ప్రజలు అందరూ చూసారన్నారు. అది అందరికీ తెలుసని, మాట్లాడేటప్పుడు నోరు సంభాళించుకుని మాట్లాడం నేర్చుకోండన్నారు. గౌరవంగా మాట్లాడం నేర్చుకోండని, జనసేన నేతలు మాట్లాడిన అర్థం లేని మాటలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసీపీ పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ లు గొర్రెల శ్రీనివాస్, మానుకొండ వెంకటేశ్వరరావు వైసీపీ నాయకులు తానేటి అజయ్, కలిశెట్టి తాతారావు, బూడిద దుర్గాప్రసాద్, చిట్టూరి బాపన్న, పాలూరి దొరబాబు, వట్టి బుజ్జి, మద్దుకూరి మెహెర్ ప్రసాద్, బండి నరసింహ, గోకా వెంకటేశ్వరరావు, కేశాని అశోక్, ఎస్ఎం.సుభాని, గోపీ జానీ, కండెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యవతి నగర్ అమ్మకాలనీ లో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 03.**తాడేపల్లిగూడెం స్థానిక 11వ వార్డు సత్యవతి నగర్ అమ్మకాలనీ నందు తాడేపల్లిగూడెం పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఎరుబండి సతీష్ అమ్మానాన్న (త్రిమూర్తులు జానకి ) జ్ఞాపకార్థం స్థానిక కనక మహాలక్ష్మి గుడి వద్ద రోడ్డు లో అమ్మ కాలనీ వద్ద (సుమారు 7,8 గ్రామాలు వెళ్లే దారి)గత 10 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ రోజు చలివేంద్రాన్ని స్థానిక తాడేపల్లిగూడెం శాసన సభ్యులు ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్, పట్టణ అధ్యక్షులు రాంపండు , రాష్ట్ర యువత నాయకులు పసల కొండ , జిల్లా నాయకులు వాడపల్లి సుబ్బరాజు , జనసేన నాయకులు కాళ్ళ గోపి, యాదల శివాజీ , అడ్డగర్ల సూరిబాబు, చేపల రమేష్, అడబాల మురళి, బేతిన గిరి , మద్దిపాటి ధర్మేంద్ర , పసుమర్తి రామ్ లక్ష్మణ్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళి , మద్దాల మణి కుమార్, మలపాక చిట్టీ, బాలాజీ, బీజేపీ నాయకులు సామినేని రంగారావు ,దాట్ల జగన్నాథ్ రాజు, విజయకుమారి, లీలా, నాజిముద్దీన్ , నిరంజన్ , షరీఫ్, ఇమ్మమ్,బాలరాజు, సాయి జగదీశ్, ప్రసాద్, సత్యనారాయణ, మేక వెంకట్, దాసరి గనిరాజు, కామేశ్వరరావు, సురేష్ , వేణు, యేసు బాబు , లక్ష్మణ్ రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అమ్మ కాలనీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి అన్నదానం లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:**స్థానిక జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్ నందు వేంచేసియున్న శ్రీ కోదండరామ దేవాలయంలో జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ అన్నదానంలో వందలాది భక్తులు, ప్రజలు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనదన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సౌభ్రాతృభావాన్ని , దేశ సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియ జేస్తాయిన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏ.ఆర్) ఎల్. చించి రెడ్డి , డి.ఎస్.పి( ఎస్ బి) బి. రామకృష్ణ , డి.ఎస్.పి( ఏ ఆర్) రవికుమార్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనమహిళకు పదివేలు అందజేత

- తెలంగాణ రాష్టం భద్రాచలం ధాతలు,ఎన్.మధు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఏప్రిల్.3:** గిరిజన(కొండరెడ్డి)మహిళకు ఆర్థిక సహాయం చేయండి. అంటూ ఇటీవల పెన్.పవర్.పత్రికలో ప్రచురించబడిన వార్తకు స్పందించిన,తెలంగాణ రాష్ట్రంభద్రాచలం ధాతలు,ఎన్.మధు కుటుంబ సమేతంగావచ్చి,కెచ్చులభీమిరెడ్డి,కుమార్తె,అపర్ణ, నుపరామర్శించి,ఆకుటుంబానికి పదివేలరూపా యలు,పండ్లుశుక్రవారం వి.ఆర్.పురం మండల వై.సి.పి.యూత్,నాయకులు సోడి చిరంజీవి ద్వారావారికిఅందజేశారు. భద్రాచలం నుండివ చ్చిన,ఎన్.మదు,కుటుంబసభ్యులకు కెచ్చులబీ మిరెడ్డి,కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్,రాష్ట్రాలు,ఏర్పాటు చేయక ముందురేఖపల్లి, ప్రభుత్వవైద్యశాలో విధులు నిర్వహించిన,డాక్టర్, సుందర్,ప్రసాద్,పోన్,పో ద్వారా భీమిరెడ్డి,కుటుం బానికిఅయిదు వేలరూపాయలు అందజేశారు. కెచ్చులబీమిరెడ్డి,కుటుంబ సభ్యులుడాక్టర్,సుందర్, ప్రసాద్,కు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైనా ఆర్థిక సహాయంచేసే ధాతలుఉంటే సహయంఅందించండి. అంటూ కొత్తూరు గ్రామానికి చెందిన కెచ్చులబీమిరెడ్డి, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# గ్రామస్థాయిలో బిజెపి బలోపేతానికి కృషి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఏప్రిల్ 3;** బిజెపిని గ్రామస్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఏలూరు జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చాత్రాతి ప్రసాదు సూచించారు. శుక్రవారం జీలుగుమిల్లిలో చాత్రాతి ప్రసాదు ఇంటి వద్ద పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్ర శిక్షణ మహా అభియాన్ బిజెపి శ్రేణులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు దీన దయాల్ ఉపాధ్యాయ ఆలోచనలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ప్రజలతో మమేకమై పార్టీపై విశ్వాసం పెంచేలా కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోరాగం వెంకటలక్ష్మి, రాష్ట్ర ఎస్టీ మోర్చ నాయకురాలు వంక కాంచనమాల, గడ్డ మణుగు సత్యనారాయణ, జిల్లా నాయకులు కరిబండ నాగరాజు, కొండపల్లి ప్రసాదు, ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ కే రామకృష్ణ, మండల నాయకులు పులగం సుబ్బారెడ్డి, భీమిరెడ్డి ప్రసాద్ రెడ్డి, రేపాక గోపాలం, కోలా లక్ష్మణ్, టీవీఎస్ రెడ్డి, కక్కిరాల చినరాములు, గుజ్జు ప్రసాదు, నెహ్రూ రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చిన చంద్రబాబు, పవన్ కి పాలాభిషేకం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 03:**తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పెంటపాడు మండలం రామచంద్రాపురం గ్రామం నందు ఎన్నికలకు ముందు చేనేతలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు కరెంటు ఉచితంగా చేనేతలు ఇచ్చిన హామీ నెరవేర్చిన సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) వారిని కలిసి కూటమి ప్రభుత్వం చేనేతలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, గంధం సతీష్, వాసా గణపతి, పుట్టా రాంబాబు, నల్లమిల్లి గోపిరెడ్డి, పుట్టా రమేష్, పోతురాజు సత్యనారాయణ, ముప్పిడి రమేష్, ఎర్ర కనక లింగేశ్వరరావు, పల్లా సత్యనారాయణ, పల్లేటి చక్రధర్, తమ్మ వెంకట శివ నాగేశ్వరరావు, సినిగిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు....



**అడ్డతీగల, పెన్ పవర్, ఏప్రిల్ 03:** అడ్డతీగల మండలం చేను పాకలు సమీపంలో మధ్యాహ్న సమయంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి ఎన్. హెచ్ ఈ 516 జాతీయ రహదారి నుండి క్రిందకు పొలముల్లోకి మోటార్ సైకిల్ దూసుకు వెళ్లిపోవడంతో, ముప్పన శెట్టి. సురేష్ 30 అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. కొంతసేపటికి పాదచారులు చూసి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా హుటాహుటిన చేరుకున్న 108 వాహనం క్షతగాత్రున్ని అడ్డతీగల ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం అతను పరిస్థితి నిలకడగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

## బీసీల హక్కులను హరిస్తున్న కూటమి ప్రభుత్వం

- ఈనెల 11న బీసీవైపి అధినేత బోడె ఆమరణ దీక్ష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 3 :**బీసీలు తమ పార్టీకి మూల స్తంభాలని చెప్పుకుంటున్న చంద్రబాబునాయుడు ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ ప్రజల హక్కులను హరిస్తురని రాష్ట్ర పీఏసీ సభ్యులు అత్తిలి రాజు ధ్వజమెత్తారు.

ఎన్నికల ముందు అధికారంలో రాగానే బీసీల రక్షణకు, అభివృద్ధికి ఎన్నో పథకాలు తీసుకువస్తానని ఇచ్చిన హామీలు చంద్రబాబు నాయుడు పాలన రెండేళ్లయినా అమలు పరచలేదని విమర్శించారు.

స్థానిక శ్రీ కారం హాల్ లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర పార్టీ పీఏసీ సభ్యులు అత్తిలి రాజు మాట్లాడుతూ, బీసీ హక్కుల సాధన కోసం భారతీయ చైతన్య యోజన పార్టీ కూటమి ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు డిమాండ్లపై నేటికి ప్రభుత్వం స్పందించ లేదని విమర్శించారు. బీసీల రక్షణ చట్టం అమలు చేయాలని, బి సి

కార్పొరేషన్లకు నిధులు కేటాయిం చాలని, సమగ్ర కుల గణన జరిపించాలని, రాజధానిలో వెయ్యి ఎకరాలు స్థలం కేటాయించాలని, స్థానిక సంస్థల్లో , విద్యా , ఉద్యోగ రంగాల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో 139 బీసీ కులాలకు చెందిన మూడు కోట్ల మంది ఉన్నారని, జగన్ అయినా చంద్ర బాబు అయినా ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగించు కుంటున్నాయని విమర్శించారు.

బీసీల హక్కుల సాధన కోసం భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఈనెల 11వ తేదీన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అమరావతిలోని పూలే మండల్ భవన్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నారన్నారు. ఈ పోరాటానికి ప్రభుత్వం స్పందించకపోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.పార్టీ నగర కన్వీనర్ వనుము శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని అన్నారు. బీసీలకు బీసీలకు అన్ని రంగాల్లో 44 శాతం రిజర్వేషన్ అమలుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళ కో-కన్వీనర్ నాగేశ్వరీ బీసీల హక్కుల సాధనలో రాజకీయ పార్టీల కతీతంగా బీసీలు ఐక్యత కావలసిన అవసరం ఉందని, బోడే దీక్షను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర యూత్ కన్వీనర్ మారిశెట్టి సూరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు టి. శీతాల్, నీలపాల సాయి మణికంత, కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కో-కన్వీనర్ జే. లక్ష్మణ్, రాజ్ కుమార్, నాయకులు గౌతమ్, సాయి, అంకం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయంలో 'ప్రజావారధి' లో విజ్ఞాపనలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ ,ఏప్రిల్ 3,** ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ నిర్వహి స్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సపల్లి హారిక ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినుతులను స్వీకరించారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు, కోలమూరులో డ్రైనేజీ, రోడ్లు, సిటిఆర్ రోడ్ లో దొంగతనాలు, వికలాంగులు పింఛన్ల సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయని అడబాల రామకృష్ణ తెలిపారు. వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో జోనల్ ఇన్చార్జ్ బొమ్మలు దత్తు, రాష్ట్ర నాయకులు , జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామ కృష్ణంరాజు, యానాపు ఏసు, పడాల హత్తి రామ్, డాక్టర్ అనురాధ అడబాల రామకృష్ణ ,కాలేపు సత్య సాయిరాం ,వీరా వీరాంజనేయులు జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లక్షల కోట్లు అప్పు చేసి రాజధాని అమరావతి నిర్మాణం అవసరమా ?



- చంద్రబాబు సామాజిక వర్గం వారే అమరావతి ని వ్యతిరేకిస్తున్న వైనం
- తమ పార్టీ అధికారంలోకి వస్తే రాజధాని మారొచ్చు సవరణలు మామూలే
- మీడియా సమావేశంలో రాజధాని అమరావతిపై చంద్రబాబు తీరుపై మాజీ ఎంపీ భరత్ రామ్ ధ్వజం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 3:**లక్షల కోట్ల వ్యయంతో మునిగిపోయే ప్రాంతంలో అమరావతి పేరుతో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని నిర్మాణం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయి, పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రానికి రాజధాని మధ్య ప్రాంతంలో లేదని, ఏ రాజధాని కూడా ఒక రోజులో, ఒక సంవత్సరంలోనో నిర్మాణం జరగలేదని ఏళ్ల పాటు జరిగా యన్నారు. చంద్రబాబు నాయుడు తాను అధికారంలో ఉన్న పరిమిత కాల వ్యవధిలోనే ప్రపంచంలోనే అద్భుతమైన రాజధాని నిర్మాణం అంటూ లక్షల కోట్లు అప్పులు చేయడం రాష్ట్ర ప్రజల ఎత్తిన పెను భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే విశాఖపట్నం ,విజయవాడ వంటి నగరాలు అభివృద్ధి చెంది ఉన్నాయని ఈ నగరాల్లో కేవలం పదివేల కోట్లు ఖర్చు చేస్తే దేశంలో ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల రాజధానులతో తక్కువ సమయంలో సమానంగా అభివృద్ధి చెందవ చ్చునన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి జగన్ "మావిగన్" ప్రతిపాదన చేశారని రాష్ట్ర ప్రజల భవిష్యత్తు రీత్యా సముచితమైన నిర్ణయం అన్నారు. ఈ ప్రతిపాదనపై సోషల్ మీడియాలో అడ్డగోలుగా జగన్ ను ట్రోలింగ్ చేయడం అనుచితమన్నారు. సిపోర్టు, ఎయిర్పోర్టుల కనెక్టివిటీ ఉన్నటువంటి గ్రోత్ ఇంజన్ కలిగిన రాజధాని ప్రాంతం విభజిత ఆంధ్రప్రదేశ్ కు అవసరమన్నారు. లక్షల కోట్ల అప్పులతో అమరావతి రాజధాని నిర్మాణం చేయడం పట్ల చంద్రబాబు సొంత సామాజిక వర్గంలోనే మాజీ అధికారులు, మేధావులు, మంత్రులు ,ఎంపీలు, ఎమ్మెల్యేలు వ్యతిరేకత ఉందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రజలకు గ్రోత్ ఇంజన్ కాదని, చంద్రబాబు , పవన్ కళ్యాణ్, లోకేష్ లకే నని భరత్ ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో 3 లక్షల కోట్ల, చంద్రబాబు ప్రభుత్వంలో 3 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే రాజధాని మార్పు చేయవచ్చునని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నాయుడు మద్దతు లేకుండా కేంద్ర ప్రభుత్వం మనుగడ సాధించలేని స్థితిలో ఉందని, ఈ పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు కేంద్రం పై ఒత్తిడి తెచ్చి అమరావతి నిర్మాణానికి గ్రాంట్లు తేవాలన్నారు. అప్పులు కాకుండా గ్రాంట్లు మీద నిధులు తెచ్చుకొని అమరావతి నిర్మాణం చేపట్టినట్లయితే తమ పార్టీ స్వాగతిస్తుందన్నారు. ఢిల్లీలో పార్లమెంట్ కొత్త భవనానికి రూ .630 కోట్లతో నిర్మిస్తే ఇక్కడ సచివాల యానికి రూ. 14 వేల కోట్లు దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు కు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి విభజన చట్టం లోని స్పెషల్ ప్యాకేజీలు వచ్చేలా, మోడీ ని ఎందుకు అడగలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వ చర్యల పట్ల రాష్ట్ర ప్రజలు ఆలోచించు కోవాలని విజ్ఞప్తి చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గోకవరం మండలంలోని పంచాయితీలలో ప్రత్యేక అధికారులు నియామకం.



**గోకవరం పెన్ పవర్ ఏప్రిల్ 03:--** వివిధ పంచాయతీ లలో సర్పంచులు పదవీకాలం నిన్నటితో ముగిసింది దీనితో పంచాయతీలలో ప్రత్యేక పాలన కు ప్రత్యేక అధికారి నియామకం జరిగింది దీనికి సంబంధించి గురువారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. గోకవరం మండలంలోని రంపఎర్రంపాలెం, గోకవరం, కృష్ణుని పాలెం, గుమ్మలదొడ్డి, గంగంపాలెం పంచాయితీలలో గోకవరం ఎంపీడీవో ఎం గోవిందు ప్రత్యేక అధికారిగా వ్యవహరించు నున్నారు.గాదెలపాలెం, అచ్యుతా పురం, తంటికొండ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా గోకవరం తాసిల్దార్ పి. రామకృష్ణ ప్రత్యేక అధికారిగా వ్యవహరించునున్నారు. తిరుమలాయ పాలెం,మల్లవరం,ఇటికాయలపల్లి గ్రామ పంచాయతీ లలో డిప్యూటీ తాసిల్దార్ వి రత్నసాగర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించునున్నారు. కామరాజుపేట, వెదురుపాక గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఆర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ ఎం వి రామకృష్ణ ప్రత్యేక అధికారిగా వ్యవహరించునున్నారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి ఐ ఎ ఎస్ వారు నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీ జై దుర్గ భవాని పాసింజర్ ఆటో యూనియన్ చలివేంద్రం ఏర్పాటు






**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 03:-** శ్రీ జై దుర్గ భవాని పాసింజర్ ఆటో యూనియన్ చలివేంద్రం ఏర్పాటు చేసారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గవిని దుర్గాప్రసాద్, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ వనం శ్రీనివాస్ ల సమక్షంలో ఏపీఎస్ఆర్టీసీ గోకవరం డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అడ్డాల అప్పారావు చలివేంద్రం రిబ్బన్ కట్ చేసి యూనియన్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ జై దుర్గ భవాని ఆటో యూనియన్ సభ్యులు జనపరెడ్డి ఉమామహేశ్వర రావు, మహిపాల్ వీరబాబు, పలుగురు ఉదయ భాస్కర్, కాపవరపు రాజు,పత్తి భీమరాజు, వట్టికూటి సత్యనారాయణ. నెల్లి బుజ్జి మరియు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


## అమరావతికి చట్టబద్ధత పై డ్వాక్రా సంఘులా ఆధ్వర్యంలో వేడుకలు



**గోకవరం పెన్ పవర్ ఏప్రియల్ 03:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించిన నేపథ్యంలో మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.ముందుగా గోకవరం మండలం మహిళా సమైక్య కార్యాలయం సమావేశ మందిరంలో పలువురు డ్వాక్రా సంఘ సభ్యులు వి వో ఏ లు డ్వాక్రా సిబ్బంది సమావేశమై అమరావతి బిల్లుకి చట్టబద్ధత కల్పించడం పట్ల స్వీట్లు పంచుకుని ఒకరికొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొవ్వొత్తులతో మానవహారంగా నిలబడి తమ సంతోషాన్ని వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు అల్లాడి అరుణకుమారి, ఏటీఎం జయంతి రాజు, సీసీలు సత్యనారాయణ, నిర్మల కుమార్, వెంకటలక్ష్మి, మండల వి వో ఏ సంఘ నాయకులు ప్రమీల రాణి, కనక రత్న కుమారి, వాణి వరలక్ష్మి మీరాభిమాలక్ష్మి, పలు మహిళా సంఘ అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొని అమరావతి బిల్లుపై తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

## వాల్మీకి వెంకన్న ఆలయంలో ముగిసిన వార్షికోత్సవాలు

### అంగరంగ వైభవంగా స్వామి అమ్మవార్ల కళ్యాణక్రతువు.



**గోకవరం పెన్ పవర్ ఏప్రిల్ 03:--** గుమ్మళ్ళదొడ్డిలోని ప్రసిద్ధ వల్మీక వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాల్గవ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. శుక్రవారం ఉదయం స్వామివారి కల్యాణ వేడుకలను శ్రీమన్నారాయణాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణ వేడుకను వీక్షించారు.ఈసందర్భంగా శ్రీమన్నారాయణాచార్యులు మాట్లాడుతూ , వల్మీక క్షేత్రంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి పూజాది కార్యక్రమాల్లో పాల్గొనడం, వార్షికోత్సవాలు, తదితర ఉత్సవాల నిర్వహణ పట్ల గ్రామస్తులు చూపుతున్న భక్తి శ్రద్ధలు ప్రశంసించదగ్గవన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, కృష్ణమాచార్యులు నేతృత్వంలో కల్యాణోత్సవం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్ల ను గ్రామంలోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శనల నడుమ నిర్వహించిన ఈ గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

